# కేసీఆర్‌కు వివాహ ఆహ్వాన పత్రిక అందజేత

మర్కూక్, ఏప్రిల్ 26: మర్కూక్ మండలం ఎర్రవల్లి మాజీ ఎంపీటీసీ భాగ్యమ్మావెంకటేశం కుమారుడు వేణు (ఏఈవో) వివాహానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించాలని కోరుతూ ఆహ్వాన పత్రికను శనివారం ఎర్రవల్లి వ్యవసాయక్షేత్రంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు అందజేశారు.



కుమారుడు వేణుతో కలిసి కేసీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న భాగమ్మ దంపతులు



## సాహిత్యకారులకు నిలయం సిద్దిపేట

సిద్దిపేట టౌన్,ఏప్రిల్ 26 : సాహిత్య కారులకు నిలయం సిద్దిపేట అని పలువురు వక్తలు కొనియాడారు.కవి వెంకటేశం రచించిన సప్తశతి మణిపూసల పుస్తకావిష్కరణ సభ శనివారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో జరిగింది.ఈ సందర్భంగా వక్త డాక్టర్ జల్లిపల్లి బ్రహ్మం మాట్లాడుతూ..దేశభక్తి కలిగిన సప్తశతి రచనల్లో మానవ జీవితం ప్రబోధించబడిందన్నారు.మణిపూసలు ప్రారంభించి నేటికి ఏడో వార్షికోత్సవం జరుపుకోవడం సంతోషంగా ఉందని మణిపూసల సృష్టికర్త సత్యం అన్నారు. పుస్తక రచయిత వెంకటేశాన్ని సత్కరించారు. ఉమాదేవి ,అనురాధ ,సత్య, ఆశీర్వాదం, అంజయ్య, చంద్రయ్య ,రాజయ్య, నరసింహారావు, భూపాల్ ,యాదగిరి, రాజు, లక్ష్మయ్య, రాజిరెడ్డి, శ్రీచరణ్ సాయిదాస్, బస్వరాజ్‌కుమార్ ,అశోక్, లక్ష్మి, సతీశ్, సురేందర్, రాంరెడ్డి, వీరారెడ్డి పాల్గొన్నారు.

# రజతోత్సవ సభకు తరలిరావాలి

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 26: వరంగల్ జిల్లాలో నేడు జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని బీఆర్ఎస్ ధూళిమిట్ట మండల అధ్యక్షుడు మంద యాదగిరి కోరారు. శనివారం మండలంలోని కొండాపూర్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ సభకు రావాలని హమాలీలను ఆయన ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోనున్నదన్నారు. కేసీఆర్ నాయకత్వాన్ని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారని గుర్తుచేశారు. రజతోత్సవ సభ జనసమీకరణ కోసం మంద యాదగిరి రూ.80వేల విరాళాన్ని అందజేశారు. మాజీ సర్పంచ్ బాదావత్‌రేఖాశ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్ జగన్, విజయ్, వెంకటయ్య, ఎనగందుల యాదగిరి, కనకాచారి, నర్సింహ, సంపత్, రాజు,బోజ్యానాయక్ పాల్గొన్నారు.



కొండాపూర్‌లో సభకు హమాలీలను ఆహ్వానిస్తున్న మంద యాదగిరి

# కడవేర్గులో బడిబాట ప్రారంభం

చేర్యాల, ఏప్రిల్ 26: మండలంలోని కడవేర్గులో శనివారం డీఈవో శ్రీనివాస్‌రెడ్డి ముందస్తు బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం శబాష్‌గూడెం, నాగపురి, పెదరాజుపేట, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో ఆయన బడిబాట ర్యాలీలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో యువకులు, గ్రామస్తులతో పాటు ప్రైవేట్ బడికి వెళ్తున్న విద్యార్థుల ఇంటికి వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. ఎంఈవో ఆర్.కిష్ట య్య, కాంప్లెక్స్ హెచ్ఎం చంద్రశేఖర్‌రావు, హెచ్ఎంలు అయిలయ్య, సంతోష్, మల్లికార్జున్‌రెడ్డి, కిషన్, రాజు, ఉపాధ్యాయులు బాలభాస్కర్, రామచంద్రమూర్తి, విజయ్, అయిల్‌రెడ్డి, విజయ్‌కుమార్, సంధ్యారాణి పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 26: సైబర్‌నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని హుస్నాబాద్ షీటీం బృందం సభ్యులు సూచించారు. పట్టణ పరిధిలోని ఆరపల్లిలో శనివారం సైబర్‌నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీటీం బృందం సభ్యులు మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల ఫోన్‌కాల్స్, మాటలు నమ్మవద్దని, సోషల్‌మీడియాకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి, డ్రగ్స్, మత్తుపదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని, పాఠశాలలకు వెళ్లే పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీటీమ్ బృందానికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ సదయ్య, కానిస్టేబుల్స్ ప్రశాంతి, కృష్ణ, ఆరపల్లివాసులు గొర్ల కొమురయ్య, మ్యాదరబోయిన శ్రీకాంత్, గొర్ల నాగయ్య, గంగుల రాజయ్య పాల్గొన్నారు.



ఆరపల్లిలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న షీటీం బృందం సభ్యులు

## ప్రాణం తీసిన ఈత సరదా

- బావిలో మునిగి యువకుడి మృతి

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 26: ఈత సరదా యువకుడి ప్రాణం తీసింది. బంధువులతో కలిసి ఈతకు వెళ్లి మృతిచెందిన ఘటన మద్దూరు మండలం సలాఖపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చేర్యాల పెద్దమ్మగడ్డకు చెందిన బింగి అఖిల్(19) మద్దూరు మండలంలోని మర్మాముల గ్రామానికి చెందిన బంధువుల ఇంట్లో జరుగుతున్న పండుగ కోసం వచ్చాడు. శనివారం ఉదయం మర్మాముల పక్క గ్రామమైన సలాఖపూర్‌లోని గూడ శ్రీనివాస్‌రెడ్డి అనే రైతుకు చెందిన వ్యవసాయ బావిలో బంధువులతో కలిసి అఖిల్ ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఈత సరిగ్గా రాక నీటమునిగాడు. ఈ విషయం తెలుసుకున్న మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్ ఘటనా స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్లను రప్పించి బావి నుంచి అఖిల్ మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహం వద్ద బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతుడి కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



బావిలో మృతదేహం కోసం గాలిస్తున్న గజ ఈతగాళ్లు

## శతచండీయాగం ప్రారంభం

చేర్యాల, ఏప్రిల్ 26: మండలంలోని ఆకునూరు భవానీ రుద్రేశ్వరాలయం(శివాలయం)లో రుద్ర సహిత శతచండీయాగం వైభవంగా ప్రారంభమైంది. శనివారం గోపూజ, గణపతిపూజ, మాతృకనాంది, అఖండదీపారాధన, పంచగవ్యప్రాశనం, దీక్షాధారణ, యాగ సంకల్పం, యాగశాల ప్రవేశం, నవగ్రహ యోగిని, వాస్తు క్షేత్ర పాలక సర్వతోభద్రమండల దేవతా ఆవాహన, ప్రధాన కలశస్థాపన, అరణి మదనం, అగ్రిప్రతిష్ఠ, శతచండీపారాయణములు, మూలమంత్ర అనుష్ఠానములు, హోమాలు, ప్రదోషపూజ, రాజోపచారములు, తీర్థప్రసాద వినియోగం, భగవన్నామ సంకీర్తణ పూజ నిర్వహించారు. రుద్ర సహిత శతచండీయాగాన్ని బైరవభట్ల సరస్వతీసీతారామశర్మ, నాగిళ్ల వనజాశ్రీరామశర్మ, అనఘ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగించారు. కార్యక్రమంలో తోకల ఉమారాణి, వెలగల రఘువీర్, సొంరెడ్డి రాంరెడ్డి, కర్రెడ్లమాధవరెడ్డి, పాల బాలరాజు, సందెబోయిన వెంకటేశ్‌యాదవ్, కూస కిష్టయ్య, తాటికొండ యాదయ్య పాల్గొన్నారు.



ప్రారంభమైన రుద్ర సహిత శతచండీయాగం

# చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

గజ్వేల్, ఏప్రిల్ 26: గ్రామాల్లోని ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని షీటీమ్ ఏఎస్సై శ్రీరాములు సూచించారు. శనివారం మండలంలోని పిడిచేడ్‌లో చట్టాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో సంచరించే అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. మహిళల భద్రతలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు. గ్రామాల్లోని యవత మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారని, అలాంటి వారిపై నిఘా పెట్టాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు లావణ్య, శ్రీనివాస్, మహేశ్ పాల్గొన్నారు.



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న షీటీమ్ బృందం సభ్యులు

# రజతోత్సవ సభకు కదలిరావాలి

- మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్
- హుస్నాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం

హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 26: హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఎల్కతుర్తిలో నేడు జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పెద్దఎత్తున కదలి రావాలని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. హుస్నాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీవినీ ఎరుగని రీతిలో జరిగే సభకు కార్యకర్తలు ఉత్సాహంగా తరలి రావాలన్నారు. వివిధ వాహనాలను అందుబాటులో ఏర్పాటు చేసుకుని మధ్యాహ్నం మూడు గంటల వరకు సభాస్థలికి చేరుకోవాలని సూచించారు. సమావేశంలో జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న, మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ ఎడబోయిన తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగం మధుకర్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు వంగ వెంకట్రామిరెడ్డి, చౌటపల్లి మాజీ సర్పంచ్ గద్దల రమేశ్, బీఆర్ఎస్ నాయకులు ఇంద్రాల సారయ్య, వాల నవీన్, బొల్లి శ్రీనివాస్, యాస శ్రీనివాస్, గంధె చిరంజీవి పాల్గొన్నారు.



హుస్నాబాద్‌టౌన్: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్,



చేర్యాల: ముస్త్యాలలో జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీ

### జెండాలు, తోరణాలు, ఫ్లెక్సీలు...

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు హుస్నాబాద్ పట్టణం గులాబీమయమైంది. పట్టణంలోని హనుమకొండ, సిద్దిపేట ప్రధాన రహదారి మొత్తం గులాబీజెండాలు, తోరాణాలు, ఫ్లెక్సీలతో చలో వరంగల్ అంటూ ముస్తాబైంది. హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఎల్కతుర్తిలో నిర్వహిస్తున్న ఈ సభకు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలతో ఆయా చౌరస్తాలు నిండిపోయాయి. వివిధ జిల్లాల నుంచి వచ్చే ప్రజలకు స్వాగతం.. సుస్వాగతం అంటూ బీఆర్ఎస్ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

### గులాబీమయమైన చేర్యాల

చేర్యాల, ఏప్రిల్ 26: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు చేర్యాల పట్టణంతో పాటు గ్రామాలు ముస్తాబవుతున్నాయి. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ముందస్తుగా భారీ బహిరంగ సభకు సంబంధించి నియోజకవర్గంలో సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేసి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. రజతోత్సవ సభకు తరలివెళ్లే ముందు పట్టణంతో పాటు గ్రామాల్లో జెండాలు ఆవిష్కరించే విధంగా అన్ని గ్రామాల్లో జెండా గద్దెలు ముస్తాబు చేయించారు. పట్టణంతో పాటు నియోజకవర్గంలోని మండల కేంద్రాలు, జాతీయ రహదారిలో భారీగా గులాబీ అధినేత కేసీఆర్, కేటీఆర్,హరీశ్‌రావు ఫొటోలతో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేరిట అభిమానులు పెద్దపెద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.దీనికి తోడు గులాబీరంగు తోరణాలను వార్డులు, గ్రామాల్లో ఏర్పాటు చేశారు. రజతోత్సవ సభకు చేర్యాల మండలం నుంచి 10వేలు, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల నుంచి 5వేల చొప్పున ప్రజలను తరలివెళ్లే విధంగా ఎమ్మెల్యే పల్లా అన్ని ఏర్పాట్లు చేశారు.

### ఉద్యమ స్ఫూర్తితో కదంతొక్కాలి

తొగుట, ఏప్రిల్ 26: వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27వతేదీన జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఉద్యమ స్ఫూర్తితో తరలిరావాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ కోసం పిడికెడు మందితో కేసీఆర్ నాయకత్వంలో పురుడు పోసుకున్న బీఆర్ఎస్ నేడు 25 ఏండ్లు పూర్తి చేసుకోవడం గర్వంగా ఉందన్నారు.దుబ్బాక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి నాయకత్వంలో బహిరంగ సభకు వెళ్లడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటలకు గ్రామాల్లో బీఆర్ఎస్ జెండాలు ఆవిష్కరించి బహిరంగ సభకు బయలుదేరుతామన్నారు. యూత్ మండల అధ్యక్షుడు అరుణ్ కూమార్ మాట్లాడుతూ ఎల్కతుర్తి సభకు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. వారివెంట సొసైటీ వైస్ చైర్మన్ యాదగిరి, సీనియర్ నాయకులు రమేశ్, లింగంపేట గ్రామ అధ్యక్షుడు షేక్ అబిద్‌హుస్సేన్, వెంకట్రావుపేట యూత్ అధ్యక్షుడు నరేందర్ ఉన్నారు.



తొగుట: మాట్లాడుతున్న జీడిపల్లి రాంరెడ్డి

# భూ సమస్యల పరిష్కారానికే 'భూభారతి'

## కలెక్టర్ మనుచౌదరి

కొండపాక, కుకునూరుపల్లి, ఏప్రిల్ 26 : భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకువచ్చిందని కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. శనివారం కుకునూరుపల్లి, కొండపాక మండల కేంద్రాల్లో భూభారతి చట్టం పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఆయన ముఖ అతిథిగా హాజరై భూభారతి చట్టం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో భూ సమస్యలు పరిష్కరించాలనే ఉద్దేశంతోప్రభుత్వం భూభారతి చట్టం అమలు చేసిందన్నారు. జిల్లాలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. సాదాబైనామా ద్వారా కొనుగోలు చేసిన భూముల రిజిస్ట్రేషన్ ఇందులో పొందుపర్చినట్లు తెలిపారు. ధరణి ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరాలుంటే సివిల్ కోర్టులకు వెళ్లాల్సి వచ్చేదని నేడు ఆ అవసరం లేకుండా అప్పిల్ వ్యవస్థకు అవకాశం కల్పించిందన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ ప్రెసిడెంట్ నర్సారెడ్డి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ భూంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్ దిలిప్‌నాయక్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

# సమ్మర్ క్యాంపులతో పేద విద్యార్థులకు మేలు

జగదేవపూర్, ఏప్రిల్ 26: సమ్మర్ క్యాంపులతో పేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని మండల విద్యాధికారి మాధవరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని తీగుల్, ఇటిక్యాల పాఠశాలల్లో కొనసాగుతున్న సమ్మర్ క్యాంపులను ఆయన సందర్శించారు. విద్యార్థులకు నేర్పిస్తున్న కళలు, డ్రాయింగ్, కంప్యూటర్ విద్యపై ఆరా తీశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే పిల్లలకు కంప్యూటర్ విద్య నేర్పిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలని ఆయన సూచించారు. ఇటిక్యాల ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం శంకర్, ఉపాధ్యాయులు నరేందర్, అనురాధ పాల్గొన్నారు.



ఇటిక్యాల పాఠశాలలో సమ్మర్ క్యాంపును సందర్శించిన ఎంఈవో మాధవరెడ్డి

# సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 26 : మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి, సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ కోరారు. శనివారం మద్దూరు, ధూళిమిట్ట మండల కేంద్రాల్లో సార్వత్రిక సమ్మె కరపత్రాలను కార్మికులతో కలిసి వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ సర్కారు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తుందని మండిపడ్డారు. కేంద్రం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్‌కోడ్‌లను ముందుకు తెచ్చిందన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలేటి యాదగిరి, సీఐటీయూ మండల కార్యదర్శి ఎండీ షఫీ, మండల కన్వీనర్ రాజు పాల్గొన్నారు.

## విధుల్లో నిర్లక్ష్యం.. ప్రధానోపాధ్యాయుడి సస్పెన్షన్

హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్ 26: విధుల్లో నిర్లక్ష్యం వహించిన మండలంలోని మీర్జాపూర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.వేణుకుమార్‌ను వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి శనివారం సస్పెన్షన్ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం, అక్రమ ఆన్‌డ్యూటీలు, పాఠశాల పని వేళలు పాటించకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు, డీటీఎఫ్ ఆధ్వర్యంలో ఆర్‌జేడీకి ఫిర్యాదు చేసినట్లు డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి తెలిపారు. ఈ క్రమంలో పాఠశాలలో విచారణ జరిపిన ఆర్‌జేడీ ప్రధానోపాధ్యాయుడు వేణుకుమార్‌ను సస్పెన్షన్ చేసి ఉత్తర్వులు జారీ చేశారన్నారు. పేద పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ప్రధానోపాధ్యాయుడు విధుల పట్ల నిర్లక్ష్యం చేయడం తగదని డీటీఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.

## నీటి కొరత నివారణకు వాచ్‌డాగ్ కమిటీలు పనిచేయాలి

సిద్దిపేట, ఏప్రిల్ 26 : నీటి కొరత నివారణకు వాచ్‌డాగ్ కమిటీలు పనిచేయాలని అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ సూచించారు. శనివారం ఐడీవోసీలోని సమావేశ మందిరంలో జిల్లా స్థాయి వాచ్‌డాగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటి సమస్యలు తలెత్తకుండా కమిటీ సభ్యులు పనిచేయాలన్నారు. జిల్లాలో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్‌పై సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. వాచ్‌డాగ్ కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో ఎక్కువ నీరు వృథా జరిగే ప్రదేశాలు, భవనాలను గుర్తించి నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. డీపీవో దేవకీదేవి, డీఆర్డీవో జయదేవ్ ఆర్యా, మిషన్ భగీరథ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## భారత నాణ్యతా ప్రమాణాల బ్రోచర్లు అందజేత

సిద్దిపేట కమాన్, ఏప్రిల్ 26 : ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత ప్రభుత్వ వినియోగదారుల వ్యవహారాలు ఆహారం, సరఫరాల మంత్రిత్వశాఖ ఢిల్లీ వారిచే వితరణ చేయబడిన భారత నాణ్యతా ప్రమాణాల బ్రోచర్లను సిద్దిపేట పోలీసు కమిషనర్ అనురాధ, అన్ని ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులకు రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య కరీంనగర్ రీజియన్ కార్యదర్శి బూట్ల రాజమల్లయ్య, బీఐఎస్ వలంటీర్ కక్కెర్ల రవీందర్ శనివారం అందజేశారు. సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్‌కు బీఐఎస్ కేర్ యాప్ గురించి వివరించారు.

# విద్యార్థులు ఉన్నత స్థాయిలో స్థిరపడాలి

గజ్వేల్, ఏప్రిల్ 26: విద్యార్థులు ఉన్నత స్థాయిలో స్థిరపడాలని నిమ్స్ దవాఖాన ప్రొఫెసర్ టామ్ చర్యన్ కోరారు. శనివారం గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల 17వ వార్షికోత్సవం కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయిలో ఉండాలంటే క్రమశిక్షణ, ఓర్పు, మంచి ఆలోచన విధానాలు ఉండాలన్నారు. కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంలో అధ్యాపకుల కృషి ఎంతో ఉందన్నారు. అంతకు ముందు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ అందజేశారు. ప్రొఫెసర్ సునీతారామ్, ప్రిన్సిపాల్ అనిత అబ్రహం, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, జార్జ్ మార్షల్, ఆకుల నరేశ్‌బాబు పాల్గొన్నారు.

## హుస్నాబాద్ చేరుకున్న గల్ఫ్ బాధితుడు లింగయ్య

హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్ 26: వారం రోజుల క్రితం గల్ఫ్‌లో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ తనని ఇండియాకు తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సెల్ఫీ వీడియో ద్వారా వేడుకున్న గల్ఫ్ బాధితుడు చొప్పరి లింగయ్య శనివారం స్వగ్రామం హుస్నాబాద్‌కు చేరుకున్నాడు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఎన్నారై అడ్వైజరీ కమిటీ చైర్మన్ బీఎం వినోద్‌కుమార్, వైస్ చైర్మన్ మంద భీమ్‌రెడ్డిని సమన్వయం చేసి గల్ఫ్‌లోని ఎన్నారై ప్రతినిధుల సహకారంతో మంత్రి పొన్నం ప్రభాకర్ లింగయ్యను ఫ్లైట్ టికెట్ డబ్బులు చెల్లించి స్వగ్రామానికి తీసుకువచ్చారు. స్వగ్రామానికి క్షేమంగా వచ్చేలా కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు చొప్పరి లింగయ్య కృతజ్ఞతలు తెలిపారు.



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కుటుంబ సభ్యులతో చొప్పరి లింగయ్య

# పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

రాయపోల్, ఏప్రిల్ 26 : పిల్లలకు పౌష్టికాహారం అందించాలని దుబ్బాక ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ఎల్లయ్య సూచించారు.శనివారం దౌల్తాబాద్‌లోని వీఆర్ గార్డెన్‌లో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఐదేండ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని సూచించారు. బాలింతలు,గర్భిణులు తప్పకుంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్,ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ, వైద్యాధికారి నాగరాజు, రిలయన్స్ జిల్లా కోఆర్డినేటర్ రాజలింగం, పోషణ్ అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ వెంకటప్రసాద్, బ్లాక్ కో ఆర్డినేటర్ శ్యామ్‌సన్, రిలయన్స్ ఫౌండేషన్ బ్లాక్ కో ఆర్డినేటర్ భాస్కర్, సరిత, నాగరాజు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు గిరిజ, చంద్రకళ, అంతుల్, రేణుక, స్వరూప, రాజేశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్ గీతాభావని పాల్గొన్నారు.

### గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

సిద్దిపేట,ఏప్రిల్ 26: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల తల్లిగర్భంలో ఉన్న శిశువు ఆరోగ్యంగా ఉంటుందని కౌన్సిలర్ కలకుంట్ల మల్లికార్జున్ తెలిపారు. శనివారం సిద్దిపేట పట్టణలోని 28వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే, పోషణ్ పక్షోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు బాల్‌లక్ష్మి, విజయలక్ష్మి, కవిత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పహల్గాం మృతులకు నివాళి

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 26: జమ్ముకశ్మీరులోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడికి నిరసనగా మండలంలోని రేబర్తిలో శుక్రవారం రాత్రి గ్రామ యువకుల ఆధ్వర్యంలో కొవొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం వద్ద ఉగ్రదాడిలో మృతి చెందిన అమరవీరులకు కొద్దిసేపు మౌనం పాటించి నివాళులర్పించారు. గ్రామ యువకులు పాల్గొన్నారు.



రేబర్తిలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న యువకులు

### సిద్దిపేటలో..

సిద్దిపేట కమాన్, ఏప్రిల్ 26 : జమ్ము కశ్మీరులోని పహల్గాంలో ఉగ్రదాడికి నిరసనగా సిద్దిపేట ఫ్లెక్సీ ప్రింటింగ్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఫ్లెక్సీ ప్రింటింగ్ ఓనర్స్ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రాజేశ్, ఉపాధ్యక్షుడు శరత్‌కుమార్, క్యాషియర్ అజయ్ కుమార్, జాయింట్ సెక్రటరీ పవన్ పాల్గొన్నారు.

### ఉగ్రవాదుల దాడిని ఖండిస్తున్నాం

సిద్దిపేట టౌన్ ,ఏప్రిల్ 26 : కశ్మీరులోని పహల్గాంలో భారత పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి తెలిపారు. ఉపాధ్యాయ సంఘం జిల్లా సమావేశం శనివారం జరిగింది. మృతులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. జిల్లా అధ్యక్షుడు విజయేందర్‌రెడ్డి ,సత్యనారాయణ ,నరసింహారెడ్డి ,శివాజీ ,మల్లేశం ,అజీజ్ ,సత్యం ,శ్రీనివాస్ ,ప్రభాకర్ ,రాజులు ,జమీర్ ,మోహియొద్దీన్ ,రామస్వామి ,సుధాకర్‌రెడ్డి ,రాజేందర్ ,వెంకటేశం ,కనకయ్య ,ఎల్లం పాల్గొన్నారు.





ఉగ్రవాదుల దాడికి నిరసనగా సిద్దిపేటలోని మూడో వార్డు మారుతీనగర్ (రంగధాంపల్లి) ఫ్యామిలీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు

## కొనసాగుతున్న సమ్మర్ క్యాంపులు



మిరుదొడ్డి, ఏప్రిల్ 26: మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో మూడు రోజులుగా సమ్మర్ క్యాంపులు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా చెప్యాల ప్రాథమిక పాఠశాలలో శనివారం యోగా, చేతిరాత, చిత్ర లేఖనం వంటివి విద్యార్థులు నేర్చుకొని చిత్ర లేఖనం బొమ్మలు వేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు

మిరుదొడ్డి, ఏప్రిల్ 26 : పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలైన ఘటన మిరుదొడ్డిలో చోటుచేసుకుంది. మిరుదొడ్డి టౌన్ ప్రజలు శనివారం తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం రాత్రి పిచ్చికుక్క వీధుల్లో స్వైర్య విహారం చేస్తూ కనిపించిన వారిపై ఇష్టారీతిగా దాడిచేస్తూ కరిచింది. పిచ్చికుక్క దాడిలో గాయాలపాలైనవారు మొగుళ్ల రాజు, పెద్దకుర్మ సత్తవ్వ, ఎం.ఎల్లవ్వ, మనోజ్ కుమార్, ర్యాకం భాను, ఉదయ్ కుమార్ మిరుదొడ్డి ప్రాథమిక దవాఖానలో, పక్కీర్‌గల్ల లోకేశ్, పుల్లూరి ప్రశాంత్ సిద్దిపేట ఏరియా దవాఖానలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ పంచాయతీ సిబ్బంది పిచ్చి కుక్కను చంపారు.

## పోచయ్య మరణం బాధాకరం

తొగుట, ఏప్రిల్ 26: మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన పొట్టనొల్ల పోచయ్య మరణం బాధాకరమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆయన మృతిదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబీకులను పరామర్శించి రూ.2500 ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు డబ్బికారి పెంటోజీ, బండారు స్వామిగౌడ్, కొమురయ్య, లింగం, ఎల్లయ్య, మల్లయ్య, కనకయ్య, రాజయ్య పాల్గొన్నారు.

## వ్యవసాయ పనిముట్లు పంపిణీ

గజ్వేల్, ఏప్రిల్ 26: మహిళా రైతులకు వ్యవసాయ పనిముట్లను 50 శాతం సబ్సిడీపై పంపిణీ చేశారు. ఆయా గ్రామాలకు చెందిన మహిళా రైతులకు 14 రోటావేటర్లు గజ్వేల్ రైతు వేదిక వద్ద శనివారం ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని వ్యవసాయ రంగంలో రాణించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, ఏడీఏ బాబునాయక్, ఏవో నాగరాజు, ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి పాల్గొన్నారు.

## మద్దూరులో ఏటీఎం సేవలు ప్రారంభం

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 26: మద్దూరులో 'హిటాచీ' కంపెనీకి చెందిన ఏటీఎం సేవలను వాస్విక్ ఫౌండేషన్ చైర్మన్ నిడిగొండ నరేశ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్దూరులో ఇన్నాళ్లు ఏటీఎం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఏటీఎం ఏర్పాటుకు ముందుకు వచ్చిన హిటాచి కంపెనీని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు. ఏటీఎం సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బోయిని మనోహర్, భూర్గు నర్సింహులు, దామెర మల్లేశం, బొప్పె నాగయ్య, భూర్గు రాజు, అల్ల శ్రీశైలం, గ్రామస్తులు పాల్గొన్నారు.

## తప్పిపోయిన వ్యక్తి మృతి

మిరుదొడ్డి, ఏప్రిల్ 26 : మతిస్థిమితం కోల్పోయి తప్పిపోయిన వ్యక్తి మృతి చెందిన ఘటన మిరుదొడ్డి టౌన్‌లో చోటు చేసుకుంది. మిరుదొడ్డి ఎస్సై బి.పరశురాములు తెలిపిన వివరాల ప్రకారం...మిరుదొడ్డికి టౌన్‌కు చెందిన వన్న యాదయ్య (58) కొన్నేండ్ల నుంచి మతిస్థిమితం లేక ఇంటి వద్దనే ఉంటూ కుటుంబ సభ్యులతో కలిసి జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ నెల 14వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన యాదయ్య సాయంత్రమైన ఇంటికి తిరిగి రాలేదు. కలత చెందిన కుటుంబ సభ్యులు బంధువుల ఇండ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం మిరుదొడ్డి శివారులోని చిటాయికుంట వద్ద అటవీ ప్రాంతంలో శవమైన కనిపించాడు. మృతుడి భార్య బుజ్జమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## నీట్ పకడ్బందీగా నిర్వహించాలి

సిద్దిపేట, ఏప్రిల్ 26 : మే 4న యూజీసీ నీట్ పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలని కేంద్ర విద్యాశాఖ, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అధికారులు సూచించారు. శనివారం జిల్లా కలెక్టర్లతో న్యూఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి యూజీసీ నీట్ పరీక్ష నిర్వహణపై తగు సలహాలు, సూచనలు జారీ చేశారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు చేసి, అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తుతో పరీక్ష నిర్వహించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఎం.మనుచౌదరి, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.